ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

మణికొండ: రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా 4వ సారి గెలుపొందిన టి.ప్రకాశ్‌గౌడ్‌ను మణికొండ మున్సిపాలిటీ కాలనీ సంఘాల నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కలిసి కాలనీలో మిగిలి ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీరాములు, మైనార్టీ అధ్యక్షుడు బషీర్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, పంచవటి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సీతారాం, నాయకులు రామసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నర్మద

మణికొండ: సాంకేతిక పరిజ్ఞానంతోనే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని, దానిని మరింతగా పెంపొందించే బాధ్యత యువ ఇంజనీర్లపై ఉందని శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద అన్నారు. గురువారం కళాశాలలో ఈసీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రాజెక్ట్ ఎక్స్‌పోను ను ఆమె ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచానికి మరింత సాంకేతికత అవసరం ఉందన్నారు. ప్రపంచంలో ఎలక్ట్రానిక్స్, రోబోల యొక్క ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. ఇలాంటి ఎక్స్‌పోల వలన విద్యార్థులకు మరింత పరిజ్ఞానం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్. జగదీష్, అకాడమిక్స్ డీన్ డాక్టర్ శివనాగిరెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌లు డాక్టర్ పి.సునిల్‌కుమార్, డాక్టర్ ఎస్. ఇందర్జీత్‌సింగ్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగుల సంబరాలు


కళాశాల ముందు బాణాసంచా కాలుస్తూ నినాదాలు చేస్తున్న సిబ్బంది

ఏజీవర్సిటీ: తెలంగాణ కొత్త ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. మధ్యాహ్నభోజన సమయంలో బోధన, బోధనేతర సిబ్బంది కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకున్నారు. అనంతరం బాణాసంచా కాలుస్తూ నినాదాలు చేశారు. అన్ని సంఘాల ఉద్యోగులు, విద్యార్థులు రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇచ్చి, ఈ రోజు నుంచి విశ్వవిద్యాలయం అన్ని గేట్లు తెరవాలని గతంలో మాదిరిగా ఆర్‌టీసీ బస్సులను విశ్వవిద్యాలయం లోపలికి అనుమతించాలని లేని పక్షంలో ఆందోళన చెపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, శ్రీనివాస్‌యాదవ్, పరమేష్, ప్రవీణ్‌కుమార్, ఎండీ జాహంగీర్ తదితరులు పాల్గొన్నారు.


విశ్వవిద్యాలయంలో రోడ్డుపై కేక్ కట్ చేస్తున్న ఉద్యోగస్తులు

స్కాలర్‌షిప్‌లను ప్రకటించిన 'ఐఎస్‌బీ'


గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ ప్రధాన భవనం

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) సాయుధ దళాల స్కాలర్‌షిప్‌ను ప్రకటించింది. మాజీ సైనికుల సంక్షేమ శాఖ, రక్షణ మంత్రిత్వశాఖ ఇందుకు తన సహకారాన్ని అందిస్తుంది. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, భారత ప్రభుత్వ మాజీ సైనికుల సంక్షేమ శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్‌సింగ్ కలిసి ప్రకటించారు. ఈ ప్రకటనతో ఐఎస్‌బీ సాయుధ దళాల అనుభవజ్ఞులకు లేదా పౌర జీవితంలోకి మారే సిబ్బందికి 50 శాతం ట్యూషన్ ఫీజు మినహాయింపును అందిస్తుంది. పోస్టు గ్రాడ్యుయేట్, అధునాతన మేనేజ్‌మెంట్ కోర్సుకు ఇది వర్తిస్తుంది. ప్రతి యేటా 22 మందికి ప్రయోజనం చేకూరుస్తుంది.

కోటలో విద్యార్థుల సందడి

గోల్కొండ: గోల్కొండ కోటలో గురువారం విద్యార్థులు సందడి చేశారు. నగరం నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి వేలాది విద్యార్థులు గోల్కొండకు తరలివచ్చారు. విజ్ఞాన విహార యాత్రలో భాగంగా తమ తమ ఉపాధ్యాయులతో కలిసి వచ్చిన విద్యార్థులు కోటలో కలియతిరిగారు. గోల్కొండ చరిత్రపై తాము తయారు చేస్తున్న ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులు కోటలోని ఫిరంగులు, బావులు, ఎత్తైన కోట గోడలు, భారీ చీకటి గదుల ఫొటోలను తీసుకున్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- కానరాని పారిశుద్ధ్య పనులు
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


శాతం చెరువు వద్ద వ్యర్థాలు, పిచ్చి మొక్కలు

గోల్కొండ: కొంత కాలం నుంచి పారిశుద్ధ్య పనులు అరకొరగా సాగుతున్నాయి. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో కార్వాన్ నియోజకవర్గంలో మళ్లీ దోమల బెడద తీవ్రమైంది. నాలాలు, చెరువులు ఉన్న ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఎన్నికల ప్రకటన కంటే ముందు నుంచే పారిశుద్ధ్య పనులు సరిగా జరడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నాలాలు, చెరువుల ప్రాంతాలు డంపింగ్ యార్డులుగా మారాయి. గోల్కొండ కందకాలు, గోల్కొండ నయా ఖీల వద్ద గల శాతం చెరువు, హకీంపేట్ గుల్కాపూర్ నాలా, షేక్‌పేట్‌లోని ఎర్రకుంట చెరువు, కొత్త చెరువులలో ప్రతినిత్యం వ్యర్థాల డంపింగ్ జరుగుతుంది. షేక్‌పేట్‌లోని ఎర్రకుంట చెరువు మురికి కుంటగా మారింది. ఈ చెరువుకు ఉన్న ప్రహరీ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి ఆ పరిసరాలు అధ్వానంగా మారాయి. మరోవైపు కొత్త చెరువు పరిస్థితి సైతం అధ్వానంగా మారింది. ఈ చెరువులో పరిసర ప్రాంతాల వారు యథేచ్ఛగా డంపింగ్ చేస్తున్నారు. ఈ కారణాల వల్ల చెరువు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. కొన్ని ఏళ్ల క్రితం ప్రారంభించిన శాతం చెరువు సుందరీకరణ పనులు ఎప్పుడో ఆగిపోయాయి. చెరువు చుట్టూ వేసిన ఫెన్సింగ్ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆటో ట్రాలీలలో వ్యర్థాలు డంపింగ్ అవుతున్నాయి. శాతం చెరువులో తరచూ జరిగే పూడికతీత పనులు ప్రహసనంగా మారాయి. కేవలం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికే బల్దియా వారు చెరువు పూడికతీత పనులు చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మెహిదీపట్నం, టోలిచౌకీ తదితర ప్రాంతాల నుంచి కూల్చిన భవనాల శిథిలాలు సైతం శాతం చెరువు కట్టపైనే డంపింగ్ చేస్తున్నారు. మరోవైపు బుల్కాపూర్ నాలాలో సైతం పూడికతీత పనులు జరగడం లేదు. దీంతో ఆ ప్రాంతాలు కూడా దుర్గంధం వ్యాపించడమే కాకుండా నాలాలో దోమలు పెరిగిపోతున్నాయి. దోమ కాటు ఫలితంగా తగ్గిన విషజ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. డెంగీతో పాటు మలేరియాతో స్థానికులు ఆస్పత్రుల పాలవుతున్నారు.

మలేరియా సిబ్బంది ఎక్కడ...?

కొన్ని నెలల క్రితం నగరాన్ని వణికించిన డెంగీ మళ్లీ విజృంభిస్తుంది. అప్పట్లో మలేరియా సిబ్బంది దోమల నిర్మూళనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇంటింటికి తిరిగి దోమల మందును స్ప్రే చేశారు. కొంత కాలం నుంచి మలేరియా సిబ్బంది కానరావడం లేదని పలువురు అంటున్నారు. మలేరియా క్షేత్రస్థాయి అధికారులు సైతం కానరావడం లేదనే ఆరోపణలు కూడా ప్రజల నుంచి వస్తున్నాయి. ఇకనైనా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుతున్నారు.

నిద్ర కరువైంది..



దోమల వల్ల నిద్ర కరువైంది. ఆరు నెలలుగా పారిశుద్ధ్య పనులు సవ్యంగా జరగడం లేదు. అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. ప్రధాన రహదారుల వెంట చెత్త కుప్పలు పేరుకపోయాయి. ఇటువంటి ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల నివారణకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– దేవర శ్రీనివాస్, గుడిమల్కాపూర్

విష జ్వరాలు ప్రబలుతున్నాయి..



విష జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేదలు రోగాలతో బాధపడుతున్నారు. దవాఖానాలకు తిరుగుతూ కూలీపనులకు వెళ్లలేని పరిస్థితి ఉంది. మలేరియా అధికారులు, సిబ్బంది గాఢనిద్రలో ఉన్నారు. గుంపులుగా వార్డు కార్యాలయాల వద్ద కానవచ్చే మలేరియా సిబ్బంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

– షానవాజ్‌ఖాన్, గోల్కొండ

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా..?

- గుంతలమయంగా మారిన రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు


ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న మురుగు నీరు

మైలార్‌దేవ్‌పల్లి: మురుగు నీరు రోడ్లపై పారడంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. గుంతలమయమైన రోడ్లు ఆపై మురుగునీరు పారడంతో ప్రజలు, విద్యార్థులు ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. రోజుల తరబడి మురునీరు రోడ్లపై పారడంతో వాహనదారులు, పాదచారులు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు.

గత వారం రోజులుగా రోడ్డుపై మురుగు నీరు పారుతున్న పట్టించుకునే నాథుడు కరువైయ్యారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ శ్రీ గాయత్రి పాఠశాల ప్రధాన రహదారిపై దారి పొడువున మురుగు నీరు పారుతుండడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు, మహిళలు, వాహనదారులు అటునుంచి వెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. సంబంధిత జల మండలి సూపర్ వైజర్ వినయ్ కుమార్‌కు అనేక మార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకొవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

స్థానిక నేతలు ఓట్ల కోసం ఇంటంటికి తిరిగి అడుగడానికి వచ్చారు కాని ప్రజలు పడుతున్న ఇబ్బందులు మాత్రం వారికి కనపడవని మహిళలు తీవ్రంగా మండిపడుతున్నారు. అధికారులు ఏరకంగా పని చేస్తున్నారో మధుబన్ కాలనీకి వచ్చి చూస్తే తెలుస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలనీలోని వెల్ఫేర్ అసోసియేషన్ వారు పేరుకు మాత్రమే ఉన్నట్లు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోవడంలో విఫలం అయ్యారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైన మురునీరు రోడ్లపై పారకుండా శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు అధికారులను, వెల్ఫేర్ అసోసియేషన్ వారికి కోరుతున్నారు.


గుంతలమయమైన రోడ్లు అందులో మురుగు నీరు

రోడ్లపై నడువాలంటే నరకం అనుభవిస్తున్నాం



అనేక మంది మహిళలు, విద్యార్థులు, వృద్ధులు రోడ్లపై నడువాలంటే ఇబ్బందులు పడుతున్నాం. మధుబన్ కాలనీలో ప్రతి సారి ఈ రోడ్లపై మురుగు నీరు పారుతునే ఉంటుంది. జలమండలి సూపర్ వైజర్ వినయ్‌కుమార్‌కు అనేక మార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకొవడంలేదు. మా గల్లీ లీడర్లు కూడా పట్టించుకొవడం లేదు. అధికారులులైన మా సమస్యను పట్టించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– సతీష్ స్వామి (స్థానికులు)

ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

రాజేంద్రనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుద్వేల్‌లోని కట్టమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు కోరని శ్యామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగనుందని వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలపై తొలి సంతకాన్ని చేసి ప్రజాపాలనకు స్వీకారం చుట్టారని వెల్లడించారు. పార్టీ నాయకులు కోరని మహేందర్, పెండ్యాల శ్రీధర్, అరుణ్, మహేష్, నాగి పాల్గొన్నారు.

రాష్ట్రంలో స్వర్ణయుగం మొదలైంది

గోల్కొండ: రాష్ట్రంలో స్వర్ణయుగం ప్రారంభమైందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతోనే తెలంగాణకు మంచి రోజులు మొదలయ్యాయని ఆయన అన్నారు. పోరాట యోధుడు ప్రజల పక్షపాతి అయిన రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ పాలనలో దివాల తీసిన తెలంగాణను మళ్లీ అభివృద్ధి మార్గంలో నడిపించగలరని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు సన్మానం


ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అత్తాపూర్: ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్న ప్రజాప్రతినిధులను ప్రజలు గౌరవిస్తారని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సురేందర్, సురేష్ రెడ్డిల ఆధ్వర్యంలో పలువురు స్థానిక నాయకులు గురువారం ఎమ్మెల్యేను కలసి ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నుకున్నందుకు ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమరేందర్, వనం శ్రీరామ్ రెడ్డి, కావలి శేఖర్, శ్రీధర్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, శేఖర్, కామసాని మహేందర్ రెడ్డి, చేగూరి అర్జున్ రెడ్డి, పీఎం రెడ్డి, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ప్రాముఖ్యతను విస్మరించలేం

మనూ వీసీ ఐనుల్ హసన్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఐనుల్ హసన్, ప్రొఫెసర్లు

రాయదుర్గం: డిజిటల్ విప్లవం యొక్క ప్రభావాలను, దాని ప్రాముఖ్యతను విస్మరించలేమని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, ఐఈఈఈ టాస్క్ ఫోర్స్ ఇన్ గామిఫికేషన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ అర్జెంటీనా, ఇంటర్నేషనల్ సోషియోలాజికల్ అసోసియేషన్, ఇండియన్ సోషియాలాజికల్ సొసైటీ సహకారంతో 'డిజిటలైజేషన్, న్యూమీడియా, వీడియో గేమ్ కల్చర్' అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ డిజిటలైజేషన్ సానుకూల, ప్రతికూల ప్రభావాలు దాని వినియోగంపై ఆధారపడి ఉంటాయన్నారు. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ మాట్లాడుతూ డిజిటల్ విప్లవంలో ఆర్థిక కోణాలు, పద్ధతులను పరిచయం చేయడేమ ఈ సదస్సు ఉద్దేశమన్నారు. అనంతరం ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, డాక్టర్ తాహా సంకలనం చేసిన పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ విడుదల చేశారు.

ఘనంగా కేంద్రీయ విద్యాలయ వార్షిక క్రీడోత్సవాలు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కేంద్రీయ విద్యాలయ వార్షిక క్రీడోత్సవాలను గురువారం నిర్వహించారు. విశ్రాంత పీఈటీ వి సంజీవన్, వీఎంసీ సభ్యురాలు లిజిబాబి ప్రారంభించారు. విజేతలకు బహుమతులను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడలలో రాణించేలా చూడాలన్నారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయిన వారిని వారు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రియరాణి, పీఈటీ విజయభాస్కర్‌రెడ్డి ,వందన హరముక్ ప్రసంగించారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టండి

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని ప్రజలు కలుషిత నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుమ్మర్ బస్తీ తదితర ప్రాంతాల్లో గత వారం, పది రోజులుగా కలుషిత తాగునీరు సరఫరా జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీటిలో పూర్తిగా నీరు కలుషితం కావడంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం వాతావరణంలో నెలకొన్న మార్పులకు తోడు.. కలుషిత తాగునీటి సరఫరా జరగడంతో తాము ఎలాంటి రోగాల బారిన పడాల్సి వస్తుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కలుషిత నీటి సమస్యపై సంబంధిత అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని బస్తీవాసులు వాపోతున్నారు. బస్తీ ప్రజలు ఎలాంటి అనారోగ్యానికి గురికాకముందే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని కోరుతున్నారు.

అన్ని సౌకర్యాలను కల్పిస్తాం


పంచవటి కాలనీలో కిచెన్‌షెడ్‌ను ప్రారంభించిన వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలను మెరుగుపరుస్తామని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పంచవటి కాలనీ కమ్యూనిటీహాల్ ఆవరణలో నిర్మించిన కిచెన్ షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు సామూహిక అవసరాలకు వినియోగించుకునేందుకు కమ్యూనిటీహాల్ అవసరాన్ని గుర్తించి ప్రతి కాలనీలో నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. సీతారాం, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భీంరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల విజయోత్సవం


వట్టినాగులపల్లిలో విజయోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మణికొండ: రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎ. రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయటంతో గురువారం నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని కాంగ్రెస్ నాయకులు పార్టీ జెండాను ఎగరవేసి విజయోత్సవాన్ని జరుపుకున్నారు. పార్టీ నాయకులు ధర్మపురి, అరుణ్ ముదిరాజ్, గణేష్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పరిపాలన మొదలయ్యిందని అన్నారు. ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీనే కృషి చేస్తుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు రాబోయే రోజుల్లో నిజం చేసి చూపుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నార్సింగిలో విజయోత్సాహం

మణికొండ: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయటంతో నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయోత్సవాన్ని నిర్వహించారు. బాణాసంచాకాల్చి, స్వీట్లు పంచి ప్రజల కష్టాలు తీరే కాలం వచ్చిందని, రేవంత్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాయిరాం, నాయకులు వినోద్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.


విజయోత్సవ కార్యకమ్రంలో పాల్గొన్న నాయకులు

డివైడర్‌ను ఢీ కొని వ్యక్తి మృతి

మణికొండ: ద్విచక్ర వాహనంపై వెలుతున్న ఓ వ్యక్తి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీ కొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ అకాడమీ వద్ద మొయినాబాద్ వైపు నుంచి బండ్లగూడలలోని తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నా సలీం(38) డివైడర్‌ను ఢీ కొట్టి కిందపడటంతో తలకు బలమైన గాయాలు తగిలి రక్తస్రావం కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. 'యాంగర్ ఫ్రీ లైఫ్ స్టైల్' అనే అంశంపై సీనియర్ రాజయోగ టీచర్ బి.కె.కవిత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాల కోసం 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

ప్రజల రుణం తీర్చుకుంటా: కౌసర్



గోల్కొండ: తనను కార్వాన్ ఎమ్మెల్యేగా మూడవ సారి గెలిపించిన ప్రజలకు ఎప్పుడు తాను రుణపడి ఉంటానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయనను గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్లకు చెందిన పలువురు మజ్లిస్ నాయకులు, అభిమానులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఇప్పటి వరకు వమ్ము చేయలేదని మునుముందు కూడా వారి వెంట ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలతో పాటు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బద్రుద్దీన్, షకీల్ అలీఖాన్, సయ్యద్ అలీ ఉన్నారు.

రేపు రుద్రహోమం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థాన వార్షిక సత్కార పండితులు శైవాగమ ప్రతిష్ఠాచార్య కాళ్ళకూరి సూర్యశ్రీ చేతుల మీదుగా పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6.30 గంటలకు గణపతిపూజ, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, శైవాగంము పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, త్రిశూల పూజ, మహాన్యాస మంత్రపఠనం, అమృతేశ్వరుడికి 21 ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం రుద్రహోమం, పూర్ణాహుతి, పండిత ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైద్యం, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి

సుల్తాన్‌బజార్: నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని అలాగే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖకు భాగస్వామ్యం కల్పించాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాలి ప్రసాద్‌రావు కోరారు. గురువారం కోఠిలోని ఐఎంఏ హాల్‌లో నూతనంగా ఏర్పడిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ..కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఐఎంఏ రాష్ట్ర శాఖకు 20 వేలకు పైగా సభ్యత్వం కలిగి ఉందని తెలిపారు. దేశంలో అతిపెద్ద పేరు ఉన్న స్వచ్ఛంద సంస్థ తమదన్నారు. వైద్యుల సంక్షేమం కోసం, వారి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఐఎంఏ కృషి చేస్తుందన్నారు. వైద్య ఆరోగ్య విషయంలో ప్రభుత్వానికి తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరి జనరల్ డాక్టర్ విజయరావు, స్టేట్ సెక్రెటరి రాజేందర్ యాదవ్, ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ బాల్‌రాజ్, అశోక్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ వెంకటరత్నం, ఎలక్టెడ్ ప్రెసిడెంట్ ద్వారకనాథ్‌రెడ్డి, గట్టు శ్రీనివాస్, డాక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు.